సాక్షి
నిజామాబాద్

మంగళవారం। 15। ఏప్రిల్। 2025



తీరనున్న గల్ఫ్ కార్మికుల..

గల్ఫ్ బాట పట్టిన తెలంగాణ వలస కార్మికుల ఆశలు నెరవేర్చడానికి రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది.

- 8లో ▸



లబ్ధిదారులను ఇబ్బంది పెట్టొద్దు

కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కుల పంపిణీలో లబ్ధిదారులను ఇబ్బంది పెట్టొద్దని బాల్కొండ ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి అన్నారు.

- 8లో ▸

గరిష్టం/కనిష్టం
39.7 /21.2

వాతావరణం

ఉదయం ఆకాశం మేఘావృతమవుతుంది. పగటి ఉష్ణోగ్రతలు పెరిగే అవకాశాలున్నాయి. ఉక్కపోతగా ఉంటుంది.

న్యూస్‌రీల్

సీఎం సమీక్షలో పాల్గొన్న కలెక్టర్



నిజామాబాద్ అర్బన్: రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సోమవారం హైదరాబాద్‌లోని మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థలో నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు పాల్గొన్నారు. ఈ సందర్భంగా భూ భారతి, ఇందిరమ్మ ఇళ్లు, వేసవి తాగునీటి ప్రణాళికలపై సీఎం దిశానిర్దేశం చేశారు. భూ భారతి చట్టాన్ని సమగ్రంగా అధ్యయనం చేయాలన్నారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ కార్యక్రమాన్ని పకడ్బందీగా చేపట్టాలన్నారు. వేసవిలో తాగునీటి సమస్య తలెత్తకుండా ప్రత్యేక శ్రద్ధ చూపాలని సీఎం సూచించారు.

జింక పిల్ల లభ్యం

- అటవీశాఖ సిబ్బందికి అప్పగింత



రుద్రూర్: పోతంగల్ మండలం కల్లూర్ గ్రామశివారులో సోమవారం రైతులకు కనిపించిన జింకపిల్లను స్థానికులు అటవీశాఖ సిబ్బందికి అప్పగించారు. తప్పిపోయి వచ్చిన జింకపిల్ల వ్యవసాయ పనులు చేస్తున్న రైతుల కంట పడింది. సమాచారం అందుకున్న అటవీశాఖ సిబ్బంది కల్లూర్‌కు చేరుకొని జింక పిల్లను వర్ని ఫారెస్ట్ రేంజ్ కార్యాలయానికి తరలించి చికిత్స చేయించారు. జింక పిల్ల వయస్సు వారం రోజుల్లోపే ఉంటుందని, ఆరోగ్యంగా తయారైన అనంతరం అడవిలో వదిలిపెడతామని అధికారులు తెలిపారు.

డంపింగ్ యార్డులో కమిషనర్ తనిఖీలు



నిజామాబాద్ సిటీ: నగర శివారులోని నాగారం డంపింగ్‌యార్డును సోమవారం రాత్రి 10 గంటలకు ఇంజినీరింగ్ అధికారులతో కలిసి కమిషనర్ దిలీప్‌కుమార్ ఆకస్మిక తనిఖీ చేశారు. యార్డులో పనిచేస్తున్న సిబ్బంది వివరాలను అడిగి తెలుసుకున్నారు. అగ్ని ప్రమాదాలు జరగకుండా నిరంతరం వాటర్ పంపింగ్ చేయాలని ఇన్‌చార్జి ప్రభుదాస్, జవాన్ బజరంగ్‌కు సూచించారు. కమిషనర్ వెంట మున్సిపల్ ఈఈ మురళీమోహన్‌రెడ్డి, ఏఎంసీ జయకుమార్, శానిటరీ సూపర్‌వైజర్ సాజిద్, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు ఉన్నారు.

భూ భారతితో రైతుల సమస్యలు తీరుతాయి



నిజామాబాద్ రూరల్: 'భూ భారతి'తో రాష్ట్రంలో ఉన్న రైతుల సమస్యలు తీరుతాయని రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ రేకులపల్లి భూపతి రెడ్డి అన్నారు. సోమవారం గుండారం రైతు వేదికలో సీఎం రేవంత్ రెడ్డి హైదరాబాద్‌లో ప్రారంభించిన భూభారతి కార్యక్రమాన్ని ఎమ్మెల్యే వర్చువల్‌గా వీక్షించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. బీఆర్ఎస్ హయాంలో తీసుకొచ్చిన ధరణి పోర్టల్ కేవలం కల్వకుంట్ల కుటుంబానికే అన్ని విధాలుగా ఉపయోగపడిందన్నారు. ధరణితో బీఆర్ఎస్ నేతలు కబ్జాలకు పాల్పడుతూ కోట్ల రూపాయాల భూములు వారి పట్టాదారు పాసుపుస్తకాల్లో నమోదు చేయించుకున్నారని ఆరోపించారు. ప్రస్తుతం భూ భారతిలో భూముల వివరాలు సమగ్రంగా ఉండి రైతులు, యజమానులకు అన్ని విధాలుగా అనుకూలంగా ఉంటుందని పేర్కొన్నారు. రైతుల విశ్వసనీయతను భూ భారతి చూరగొంటుందని అన్నారు. అనంతరం ఎమ్మెల్యే భూపతిరెడ్డిని గజమాలతో సన్మానించారు. ఏఎంసీ చైర్మన్ ముప్ప గంగారెడ్డి, పీసీసీ డెలిగేట్ శేఖర్ గౌడ్, జిల్లా కాంగ్రెస్ సీనియర్ నాయకులు బాగిర్ధి బాగారెడ్డి, అగ్గు భోజన్న, మునిపల్లి సాయారెడ్డి, గుండారం సింగిల్ విండో చైర్మన్ దాసరి శ్రీధర్, తదితరులు పాల్గొన్నారు.

మన పనుల్లో ఉత్తరాది కార్మికులు



ఉమ్మడి జిల్లాలో ఉత్తరాది రాష్ట్రాలకు చెందిన కార్మికులు గణనీయంగా పెరిగారు. ప్రతి రంగంలో వారి ఉనికి కనిపిస్తోంది. సుమారు ఐదువేల మంది వరకు కార్మికులు వివిధ రంగాల్లో పనిచేస్తున్నట్లు అంచనా. హోటళ్లలో కార్మికులుగా ఒడిశా, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాలకు చెందిన వారు ఉన్నారు. వ్యవసాయం, నిర్మాణ రంగం, ఇంటీరియర్, ఎలక్ట్రికల్, ప్లంబింగ్, టైల్స్, కార్పెంటర్ కార్మికులుగా బీహార్, ఉత్తరప్రదేశ్, ఢిల్లీ వాళ్లు పని చేస్తున్నారు. బొటిక్స్, డిజైనింగ్ వంటి మహిళల వస్త్రాల పనులు పశ్చిమబెంగాల్ కార్మికులే చేస్తున్నారు. బంగారం పనులను బెంగాల్ వాళ్లే చేస్తున్నారు.

- అన్నిరంగాల్లో వారి ఉనికి
- నగరం నుంచి గ్రామం వరకు విస్తరించిన వలస కార్మికులు
- సుమారు ఐదు వేల మంది ఉన్నట్లు అంచనా
- హోటళ్లు, నిర్మాణ రంగం, వ్యవసాయం, అనుబంధ రంగాల్లో వారే..
- బంగారం పని, మహిళల వస్త్రాల డిజైనింగ్ పనుల్లోనూ వారి మార్క్

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: నిజామాబాద్ ఉమ్మడి జిల్లాలో ఉత్తరాది రాష్ట్రాలకు చెందిన కార్మికులు రోజురోజుకూ పెరుగుతున్నారు. దీంతో ప్రతి రంగంలోనూ ఉత్తరప్రదేశ్, పశ్చిమబెంగాల్, బీహార్, ఒడిశా, ఛత్తీస్‌గఢ్, జార్ఖండ్, మధ్యప్రదేశ్, రాజస్తాన్ రాష్ట్రాల నుంచి వచ్చిన కార్మికులు, పనివాళ్లే కనిపిస్తున్నారు. గతంలో ఉత్తర తెలంగాణ జిల్లాల నుంచి ముంబయి, సూరత్, గల్ఫ్ దేశాలకు పనుల కోసం ఎక్కువగా వలసలు వెళ్లేవారు. ఇప్పటికీ ఉత్తర తెలంగాణ జిల్లాల నుంచి గల్ఫ్ దేశాలకు వెళుతున్నప్పటికీ గతంతో పోలిస్తే సంఖ్య తగ్గింది. వివిధ రంగాల అభివృద్ధితో జిల్లాలోనూ ఉపాధి అవకాశాలు పెరిగాయి. స్థానికంగానూ ఎకానమీ పెరిగింది. అయితే స్థానికుల కంటే ఉత్తరాది రాష్ట్రాల వారినే పనిలో పెట్టుకునేందుకు జిల్లాలోని రైతులు, వ్యాపారులు మొగ్గు చూపుతున్నారు. నిర్దేశించుకున్న సమయానికి, తక్కువ వేతనాలతోనే ఉత్తరాది రాష్ట్రాల కార్మికులు పనులు చేస్తున్నారని, పైగా నైపుణ్యం ఎక్కువగా చూపిస్తున్నారని పలువురు చెబుతున్నారు.

ఉత్తర భారతం నుంచి నిజామాబాద్, కామారెడ్డి జిల్లాలకు వివిధ పనుల నిమిత్తం సుమారు ఐదువేల మంది వరకు కార్మికులు వచ్చినట్లు అంచనా. ముఖ్యంగా హోటళ్లలో కార్మికులుగా ఒడిశా, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాలకు చెందిన సుమారు 500 మంది కార్మికులు ఉన్నారు. ఇటుక బట్టీలు మొదలు నిర్మాణరంగంలో బీహార్, ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి చెందిన సుమారు 1,500 మంది కార్మికులు ఇంటీరియర్, ఎలక్ట్రికల్, ప్లంబింగ్, టైల్స్, కార్పెంటర్ కార్మికులుగా పని చేస్తున్నారు. సెలూన్స్‌లో ఉత్తరప్రదేశ్, ఢిల్లీ వాళ్లు పనిచేస్తున్నారు. వ్యవసాయ రంగంలో బీహార్, ఛత్తీస్‌గఢ్, ఒడిశా, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాల కార్మికులు సుమారు 1,000 మంది వరకు పనిచేస్తున్నారు. వరినాట్ల సీజన్‌లో బీహార్ కూలీలు పనిచేస్తున్నారు. డెయిరీ పనితోపాటు చేపలు పట్టే పనులు సైతం చేస్తున్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో హమాలీలుగా చేస్తున్నారు. ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లు, బేకరీలు, స్వీట్‌హోంలలో ఒడిశా, రాజస్తాన్, ఉత్తరప్రదేశ్ వాళ్లు పనిచేస్తున్నారు. బొటిక్స్, డిజైనింగ్ వంటి మహిళల వస్త్రాల పనులు పశ్చిమబెంగాల్ కార్మికులే చేస్తున్నారు. బంగారం పనులను బెంగాల్ వాళ్లే చేస్తున్నారు. వీరు 1,000 మంది వరకు ఉన్నట్లు తెలుస్తోంది. బీహార్‌కు చెందిన కూలీలు ఇటుకబట్టీలో సుమారు 500 మంది వరకు పనిచేస్తున్నారు. బోర్ డ్రిల్లింగ్, పొక్లెయిన్ ఆపరేటింగ్ పనుల్లో ఉత్తరప్రదేశ్, బీహార్‌కు చెందిన వాళ్లు పనిచేస్తున్నారు. ఇందులో కొందరు సీజన్‌ను బట్టి పనుల కోసం వచ్చి వెళుతుండగా, ఎక్కువమంది పనిచేసుకుంటూ కూలీలుగా జీవిస్తూ ఇక్కడే స్థిరపడినవారు సుమారు 3వేల మంది వరకు ఉండడం గమనార్హం. రాజస్తాన్‌కు చెందిన కొందరు నిజామాబాద్‌తో పాటు వివిధ మండల కేంద్రాలు, మేజర్ పంచాయతీ గ్రామాల్లో స్వీట్‌హోమ్‌లు నిర్వహిస్తూ స్థిరపడ్డారు. కొన్ని ప్రైవేట్ పరిశ్రమలు, వాణిజ్య కేంద్రాల్లో సెక్యూరిటీ గార్డులుగా బీహార్, ఉత్తరప్రదేశ్‌కు చెందిన వారు పనిచేస్తున్నారు. పెద్ద హోటళ్లలో వర్కర్లుగా అస్సాంకు చెందిన యువకులు పనిచేస్తున్నారు.

సీజన్‌లో వచ్చి వ్యవసాయ పనులు చేస్తా



మాది ఒడిశాలోని బరంపురం. మాకు కూడా వ్యవసాయం ఉంది. సీజన్‌లో నిజామాబాద్‌కు వస్తాం. జిల్లా అంతటా తిరిగి వ్యవసాయ పనులు చేస్తాం. వ్యవసాయానికి సంబంధించి అన్ని పనులు చేస్తా. దాదాపు పదేళ్లుగా ఇక్కడికి వస్తున్నా. నాతోపాటు మా గ్రామంలోని యువకులను కూడా తీసుకువస్తా. వారికి ఉపాధి బాగా దొరుకుతోంది. వచ్చిన డబ్బులతో మిగతా కాలం జీవిస్తాం. – అరుణ్ సహానీ, బరంపురం, (ఒడిశా)

డార్జిలింగ్ నుంచి ఇందూరుకు..



మాది పశ్చిమ బెంగాల్‌లోని డార్జిలింగ్ ప్రాంతం. నేను హోటల్ మేనేజ్‌మెంట్‌లో పీజీ చేశాను. నిజామాబాద్‌కు రెండేళ్ల క్రితం వచ్చాను. వినాయక్‌నగర్‌లో ఫాస్టుఫుడ్ సెంటర్ నిర్వహిస్తున్నా. నా భార్య బ్యూటీ పార్లర్ నిర్వహిస్తోంది. ఇద్దరం కలిసి నెలకు రూ.50 వేల వరకు సంపాదిస్తున్నాం. మాకు వచ్చిన దాంట్లో మా తల్లిదండ్రులకు పంపిస్తున్నాం. – సుజిత్ టక్రీ, మోమోస్ స్పెషలిస్టు

రూ.45వేల వరకు సంపాదిస్తా



మాది బీహార్ రాజధాని పాట్నా సమీపంలోని రాంపూర్ రూరల్ ప్రాంతం. సంవత్సరానికి రెండుసార్లు నిజామాబాద్‌కు వస్తాం. సీజన్‌లో ధాన్యం పనులు చేస్తాం. ఎకరాకు ఇంత అని మాట్లాడుకుంటాం. ధాన్యం లోడింగ్, అన్‌లోడింగ్, సంచుల్లోకి నింపడం, వాటిని కుట్టడం వంటి పనులు చేస్తాం. బస్తాకు రూ.13 ఇస్తారు. ప్రతి సీజన్‌లో రూ.30 వేల నుంచి రూ.45 వేల వరకు సంపాదిస్తా. – రంజిత్ రాజా, పాట్నా (బీహార్)

రైతులకు ఇబ్బంది లేకుండా కొనుగోళ్లు

- డీసీసీబీ చైర్మన్ కుంట రమేశ్‌రెడ్డి



వేల్పూర్‌లో కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీసీసీబీ చైర్మన్ రమేశ్‌రెడ్డి

వేల్పూర్: రైతులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ధాన్యం కొనుగోళ్లకు ఏర్పాట్లు చేశామని డీసీసీబీ చైర్మన్ కుంట రమేశ్‌రెడ్డి పేర్కొన్నారు. వేల్పూర్ మండల కేంద్రంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా డీసీసీబీ చైర్మన్ మాట్లాడుతూ ఉమ్మడి జిల్లాలో 1,250 కొనుగోలు కేంద్రాలను ప్రభుత్వం ఏర్పాటు చేసిందన్నారు. నిజామాబాద్ జిల్లాలో 2 లక్షల క్వింటాళ్ల సన్నరకాలు, 50 వేల క్వింటాళ్ల దొడ్డురకం, కామారెడ్డి జిల్లాలో లక్షా 60 వేల క్వింటాళ్ల సన్నరకం, 40 వేల క్వింటాళ్ల దొడ్డురకం ధాన్యం కొనుగోలు చేసినట్లు వెల్లడించారు. ఏ రాష్ట్రంలో లేని విధంగా కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణలో సన్నరకాలు క్వింటాలుకు రూ. 500 బోనస్ ఇస్తోందన్నారు. ఈ నెల 11 వరకు ధాన్యం విక్రయించిన రైతుల ఖాతాలలో డబ్బులు జమ అయినట్లు తెలిపారు. ఉమ్మడి జిల్లాలో సరిపడా ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయించిన సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు, ఎమ్మెల్యేలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఆయన వెంట కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.

నేడు బాన్సువాడకు ఎమ్మెల్సీ కవిత రాక



బాన్సువాడ : బాన్సువాడకు మంగళవారం బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత, మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ రానున్నారు. పట్టణంలోని భారత్ గార్డెన్‌లో నిర్వహించే పార్టీ రజతోత్సవ సభ సన్నాహక సమావేశంలో వారు పాల్గొంటారని బీఆర్ఎస్ పట్టణ నాయకులు తెలిపారు. పార్టీ కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో తరలిరావాలని కోరారు.

రాజ్యాంగ స్ఫూర్తితో అభివృద్ధి దిశగా పయనం

- కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు

నిజామాబాద్ అర్బన్: భారతరత్న, రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేడ్కర్ రూపొందించిన రాజ్యాంగ స్ఫూర్తితో భారతదేశం అన్ని రంగాలలో అభివృద్ధి సాధిస్తోందని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు పేర్కొన్నారు. అన్నివర్గాల ప్రజలకు రాజ్యాంగబద్ధ హక్కులు కల్పించిన మహనీయుడు అంబేడ్కర్ అని కొనియాడారు. అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకొని పులాంగ్ చౌరస్తా వద్ద ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేశ్ రెడ్డి, కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు, అదనపు కలెక్టర్ అంకిత్, నగరపాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్, అధికారులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ రాజ్యాంగం ఆధారంగానే ప్రస్తుతం శాసన, న్యాయ, కార్యనిర్వాహక వ్యవస్థలు పని చేస్తున్నాయని, అందరికీ సమాన హక్కులు, సంక్షేమ ఫలాలు అందుతున్నాయన్నారు. సమానత్వం, సామాజిక న్యాయంతోపాటు అంబేడ్కర్ రాసిన రాజ్యాంగం, ఆయన విలువల ఆధారంగానే జిల్లా యంత్రాంగం ద్వారా ప్రభుత్వ కార్యక్రమాలను అమలు చేస్తున్నామని తెలిపారు. అనంతరం రాజీవ్‌గాంధీ ఆడిటోరియంలో నిర్వహించిన అంబేడ్కర్ జయంతి కార్యక్రమాన్ని అదనపు కలెక్టర్ అంకిత్, రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్ తదితరులు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ రాసిన రాజ్యాంగంతోనే సమాజంలో ప్రతి ఒక్కరూ హక్కులు, బాధ్యతలు, పదవులను చేపట్టగలుతున్నారని అన్నారు. మహనీయుని ఆశయ సాధన కోసం అంకితభావంతో కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా ఎస్సీ అభివృద్ధి శాఖ అధికారిణి నిర్మల, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ రమేశ్, నిజామాబాద్ ఏసీపీ రాజా వెంకట్ రెడ్డి, ఎస్సీ, ఎస్టీ, బీసీ కుల సంఘాలు, ఉద్యోగ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.



అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న కలెక్టర్, అదనపు కలెక్టర్

అనర్హులకు కార్డులిస్తే ఉద్యోగం ఊస్ట్

- రేషన్‌కార్డు దరఖాస్తుల వడపోత
- అర్హుల ఎంపికకు పకడ్బందీ చర్యలు
- క్షుణ్ణంగా సర్వే నిర్వహించాలని ఉద్యోగులకు సర్కారు ఆదేశాలు



మోర్తాడ్(బాల్కొండ): ఆహార భద్రత కొత్త కార్డులు జారీ చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం పకడ్బందీ చర్యలు చేపడుతోంది. రేషన్‌కార్డుల కోసం అందిన దరఖాస్తులను ఒకటికి రెండుసార్లు క్షుణ్ణంగా పరిశీలించాలని ఉద్యోగులను ఆదేశించింది. అనర్హులకు రేషన్‌కార్డులు అందకుండా మరోసారి సర్వే నిర్వహిస్తోంది. ఈ సర్వే నిర్వహించే ఉద్యోగులు కచ్చితంగా నిబంధనలు పాటించాలని, అనర్హులకు రేషన్‌కార్డులు జారీ అయితే ఉద్యోగం కోల్పోవాల్సి వస్తుందంటూ హెచ్చరికలు జారీ చేసినట్లు సమాచారం. గతంలో జారీచేసిన రేషన్‌కార్డులలో అనేక మంది అనర్హులు స్థానం సంపాదించుకొని ప్రభుత్వ పథకాల లబ్ధి పొందుతున్నారు. వారి నుంచి కార్డులను స్వాధీనం చేసుకునే విషయం ఎలా ఉన్నా ఇప్పుడు కొత్తగా జారీ చేసే కార్డుల విషయంలో మాత్రం చాలా జాగ్రత్తగా వ్యవహరించాలని ప్రభుత్వం భావిస్తోంది.

నేటి నుంచి కొనసాగనున్న సర్వే

గణతంత్ర దినోత్సవం రోజున జిల్లాలోని ఒక్కో మండలానికి ఒక గ్రామాన్ని ఎంపిక చేసి పలువురికి కొత్త కార్డులను పంపిణీ చేసిన విషయం తెలిసిందే. కాగా, ప్రజాపాలన, మీ సేవ కేంద్రాల నుంచి వచ్చిన మెజార్టీ దరఖాస్తులు పెండింగ్‌లో ఉండడంతో వీటిపై మరోమారు సర్వే నిర్వహిస్తోంది. గడిచిన వారంలోనే సర్వే నిర్వహించాల్సి ఉన్నా రెవెన్యూ అధికారుల మొబైల్ యాప్‌లలో లాగిన్ ఇవ్వడం, ఇతరత్రా అంశాల విషయంలో కొంత జాప్యం జరిగింది. వరుసగా సెలవులు రావడంతో ఈ నెల 15 నుంచి పక్కాగా సర్వే నిర్వహించాలని అధికారులు క్షేత్రస్థాయి ఉద్యోగులకు నిర్దేశించారు. జూనియర్ అసిస్టెంట్ క్యాడర్ ఉద్యోగులతోపాటు రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లకు ఈ సర్వే బాధ్యత అప్పగించారు. కాగా, జిల్లాలో ఇప్పటి వరకు కొత్త కార్డుల కోసం 81,148 దరఖాస్తులు రాగా, 1,066 కుటుంబాలకే కొత్త కార్డులను అందజేశారు. ఇంకా 80వేలకు మించి దరఖాస్తులు పెండింగ్‌లో ఉండడం గమనార్హం.

నిబంధనలు

- కారు ఉండొద్దు.
- సాగు భూమి 3.50 ఎకరాలలోపు ఉండాలి.
- సాగుకు యోగ్యంకాని భూమి 7.50 ఎకరాల వరకు ఉండొచ్చు.
- సంవత్సర ఆదాయం గ్రామీణ ప్రాంతాల వారికి రూ.1.50లక్షలు, పట్టణ ప్రాంతాలకు రూ.2లక్షలకు మించొద్దు.
- ప్రభుత్వ ఉద్యోగుల కుటుంబసభ్యులు, ఉద్యోగ విరమణ పింఛన్ పొందుతున్నవారు అనర్హులు.

సర్వే పక్కాగా నిర్వహించాలి

కొత్త రేషన్‌కార్డుల జారీకి ముందు ఉద్యోగులు పక్కాగా సర్వే నిర్వహించాలి. ఎవరైనా ఒత్తిడి చేస్తే ఆ విషయం మా దృష్టికి తీసుకురావాలి. తప్పుడు వివరాలను సర్వేలో నమోదు చేయొద్దు. కొత్తగా జారీ చేసే కార్డులు నూటికి నూరు శాతం అర్హులకే దక్కాలి. – కృష్ణ, తహసీల్దార్, మోర్తాడ్

అక్రమార్కుల్లో వణుకు

- జిల్లాపై కొత్వాల్ ప్రత్యేక నజర్
- తనదైన మార్క్ పాలన సాగిస్తోన్న సీపీ సాయిచైతన్య
- పేకాట, బెట్టింగ్‌పై ఉక్కుపాదం
- గంజాయి, ఇసుక రవాణాకు అడ్డుకట్ట
- వీడీసీల ఆగడాలకు చెక్‌పెట్టేలా కేసులు
- డివిజన్‌ల వారీగా పోలీస్‌బాస్ సమీక్షలు



ఖలీల్‌వాడి: అక్రమ కార్యకలాపాలపై ఉక్కుపాదం మోపుతూ అక్రమార్కుల వెన్నులో వణుకు పుట్టిస్తున్నారు నిజామాబాద్ సీపీ పోతరాజు సాయి చైతన్య. కమిషనరేట్ పరిధిలో తనదైన మార్క్ పాలన సాగిస్తూ నేరాల నియంత్రణకు కఠిన చర్యలు తీసుకుంటున్నారు. అక్రమ ఇసుక రవాణా, పేకాట, బెట్టింగ్, మత్తు పదార్థాల సరఫరాపై కొరఢా ఝుళిపిస్తున్నారు. సీపీగా బాధ్యతలు చేపట్టిన అనంతరం జిల్లాపై ప్రత్యేక దృష్టి సారించారు. మొదట ఆయా పోలీస్ స్టేషన్ల పరిధిలో జరిగే అక్రమ కార్యకలాపాలపై నివేదిక తెప్పించుకున్నారు. నేరాలు, నేరస్తులు, అక్రమదందాల స్థితిగతులపై అధ్యయనం చేసిన సీపీ..వాటికి చెక్‌పెట్టేలా చర్యలు ప్రారంభించారు.

బెట్టింగ్ నిర్వాహకులపై కేసులు

ఐపీఎల్ బెట్టింగ్‌పై కఠినంగా వ్యవహరిస్తానని ముందుగా చెప్పిన సీపీ సాయి చైతన్య.. ఆ దిశగా నిర్వాహకులపై కేసులు నమోదు చేశారు. ఆర్మూర్, బోధన్, నిజామాబాద్ నగర పరిధిలో బెట్టింగ్ ఆడుతున్న, నిర్వహిస్తున్న ముఠాను పట్టుకున్నారు.

వీడీసీలపై..

గ్రామాల్లో వీడీసీల ఆగడాలకు కళ్లెం వేస్తున్నారు. నిజామాబాద్, ఆర్మూర్ డివిజన్ల పరిధిలో కుల, గ్రామ బహిష్కరణలు చేస్తున్న వీడీసీలపై కేసులు నమోదు చేయాలని పోలీసులను సీపీ ఆదేశించారు. ఇటీవల వేల్పూర్ మండలం వెంకటాపూర్, ఏర్గట్ల మండలం తాళ్లరాంపూర్, జక్రాన్‌పల్లి వీడీసీలపై కేసులు నమోదైన విషయం తెలిసిందే.

అక్రమ దందాపై..

అక్రమ దందాపై సీపీ ఉక్కుపాదం మోపుతున్నారు. ఇసుక అక్రమ రవాణా చేస్తున్న ట్రాక్టర్లు, టిప్పర్లు, పొక్లెయిన్లను సీజ్ చేయడంతోపాటు నిర్వాహకులపై కేసులు నమోదు చేస్తున్నారు. అదేవిధంగా మొరం అక్రమ రవాణా, పీడీఎస్ బియ్యం, గంజాయి, మత్తు పదార్థాలు రవాణా చేసే వారిని పట్టుకుంటూ హడలెత్తిస్తున్నారు.



సీపీ సాయిచైతన్య

మత్తు వదిలేలా..

నగరంలోని పలు హాస్టళ్లపై ఇటీవల స్పెషల్ పోలీసు బృందాలు, డాగ్‌స్క్వాడ్‌తో తనిఖీలు నిర్వహించారు. మత్తు పదార్థాలైన గంజాయి, డ్రగ్స్ బారిన యువత పడకుండా కఠిన చర్యలు తీసుకుంటున్నారు. రాత్రిపూట అనవసరంగా రోడ్లపై తిరుగుతూ, వాహనాలతో ప్రమాదకర విన్యాసాలు చేసే పోకిరీలపై కొరఢా ఝుళిపిస్తున్నారు. తల్లిదండ్రులను పోలీస్ స్టేషన్లకు పిలిపించి వారి ముందే కౌన్సెలింగ్ ఇప్పిస్తున్నారు.

సుదీర్ఘ సమీక్ష

కమిషనరేట్ పరిధిలో నేరాల నియంత్రణకు ఆయా డివిజన్‌ల సీఐలు, ఎస్సైలతో సీపీ ప్రత్యేకంగా సమీక్షిస్తున్నారు. ఇటీవల బోధన్, నిజామాబాద్ డివిజన్లలోని పీఎస్‌లలో కేసుల వివరాలు, పెండింగ్ కేసులు, ఛార్జ్‌షీట్ వేయాల్సి కేసులు, కోర్టులో కొనసాగుతున్న కేసుల వివరాలను కూలంకషంగా తెలుసుకున్నారు. ఒక్కో కేసును పరిశీలిస్తూ జాప్యానికి కారణాలను తెలుసుకొని సూచనలు జారీ చేశారు. ఒక్కో డివిజన్‌పై సీపీ చేపట్టిన సమీక్ష ఉదయం 11 గంటలకు ప్రారంభమై రాత్రి 8 గంటల వరకు కొనసాగడం గమనార్హం. ఇదిలా ఉండగా పలు వివాదాల్లో తలదూర్చే సిబ్బందిపై ప్రత్యేక దృష్టి సారించినట్లు తెలిసింది.

క్లుప్తంగా

బార్ అసోసియేషన్ ప్రమాణ స్వీకారం



ఖలీల్‌వాడి: నగరంలో సోమవారం నిజామాబాద్ బార్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం నిర్వహించారు. అధ్యక్షుడు సాయరెడ్డి, ప్రధాన కార్యదర్శి మాణిక్‌రాజు, మహిళా ప్రతినిధి రమాదేవి, కోశాధికారి నారాయణ దాస్‌లు ప్రమాణ స్వీకారం చేశారు. ఎన్నికల అధికారి వెంకటేశ్వర్, కమిటీ సభ్యులు ఆకుల రమేష్, నరసింహరెడ్డి, బాస రాజేశ్వర్, మాజీ అధ్యక్షుడు జగన్‌మోహన్‌గౌడ్, సుదర్శన్ పాల్గొన్నారు. ఎన్నికలు ఆలస్యంగా జరిగినందున నలుగురితో ప్రమాణ స్వీకారం చేయించారు. మిగితా వారితో త్వరలో ప్రమాణ స్వీకారం చేయిస్తామని అధ్యక్షుడు సాయ రెడ్డి తెలిపారు.

'భూభారతి' ప్రారంభ కార్యక్రమాన్ని తిలకించిన రైతులు



సదాశివనగర్(ఎల్లారెడ్డి): మండలంలోని అడ్లూర్ ఎల్లారెడ్డి రైతు వేదికలో సోమవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా భూ భారతి పోర్టల్ ప్రారంభ కార్యక్రమాన్ని జిల్లా వ్యవసాయాధికారి తిరుమల ప్రసాద్, మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు, రైతులు తిలకించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి ప్రజాపతి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సంగారెడ్డి, సేవాదళ్ జిల్లా అధ్యక్షుడు లింగాగౌడ్, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు మద్దెల బాగయ్య, సీడీసీ చైర్మన్ ఇర్షాదొద్దీన్, విండో చైర్మన్ సదాశివరెడ్డి, సాదీక్ అలీ, తదితరులు పాల్గొన్నారు.

మహమ్మద్ నగర్ రైతువేదికలో..

నిజాంసాగర్(జుక్కల్): మహమ్మద్ నగర్‌లోని రైతువేదికలో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా భూ భారతి పోర్టల్ ప్రారంభ కార్యక్రమాన్ని పిట్లం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ చీకోటి మనోజ్‌కుమార్, అధికారులతో కలిసి తిలకించారు. కార్యక్రమంలో మహమ్మద్ నగర్, నిజాంసాగర్ మండలాల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు రవీందర్ రెడ్డి, ఏలే. మల్లికార్జున్, మహమ్మద్ నగర్ మండల వ్యవసాయశాఖ అధికారిణి నవ్య, ఏఈవోలు మధుసూదన్, రేణుక, రైతులు ఉన్నారు.

కల్తీ కల్లు బాధితులకు నష్టపరిహారం ఇవ్వాలి



బాన్సువాడ : కల్తీ కల్లు సేవించి ఆస్పత్రి పాలైన బాధితులందరికి నష్టపరిహారం ఇవ్వాలని పౌర హక్కులసంఘం నిజనిర్ధారణ కమిటీ సభ్యులు డిమాండ్ చేశారు. సోమవారం నస్రుల్లాబాద్ మండలం దుర్కి, అంకోల్, అంకోల్‌తండా గ్రామాల్లో కమిటీ సభ్యులు పర్యటించారు. ఇటీవల కల్తీకల్లు సేవించి ఆస్పత్రి పాలైన బాధితులను కలిసి వివరాలు సేకరించారు. కల్లు బాధితులందరికి ఒక్కొక్కరికి రూ. లక్ష నష్టపరిహారాన్ని కల్తీ కల్లు కాంట్రాక్టరు వద్ద ఇప్పించాలని వారు డిమాండ్ చేశారు. మత్తు, పదార్థాలైన డైజోఫాం, క్లోరోఫాం రవాణాను అరికట్టాలన్నారు. అర్హులైన గీత కార్మికులకు మాత్రమే లైసెన్సులు ఇవ్వాలని, గీత కార్మికులందరికి నెలకు రూ. 3 వేల పింఛను ఇవ్వాలని, గీత పారిశ్రామిక సహకార సొసైటీలను ప్రభుత్వమే నిర్వహించాలన్నారు. కల్తీ కల్లు తయారు చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సభ్యులు అల్గోట్ రవీందర్, సంగం, ఎడ్ల రాజు, గైని శ్రీనివాస్ తదితరులున్నారు.

తీరనున్న గల్ఫ్ కార్మికుల ఆశలు!

- సమగ్ర ప్రవాసీ విధానం రూపకల్పన, గల్ఫ్ బోర్డు ఏర్పాటుకు బాటలు వేయనున్న 'సలహా కమిటీ'
- త్వరలో కార్యరూపం దాల్చనున్న గల్ఫ్ బోర్డు



ప్రభుత్వ ప్రతినిధిని సత్కరిస్తున్న అధ్యయన సలహా కమిటీ సభ్యులు, కార్మిక సంఘాల ప్రతినిధులు

మోర్తాడ్(బాల్కొండ): గల్ఫ్ బాట పట్టిన తెలంగాణ వలస కార్మికుల ఆశలను నెరవేర్చడానికి రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. సమగ్ర ప్రవాసీ విధానానికి రూపకల్పన చేసి తద్వారా గల్ఫ్ బోర్డుకు అంకురార్పణ చేయడానికి ప్రభుత్వం చొరవ తీసుకుంది. గల్ఫ్ వలసదారుల ఆశలను సజీవం చేయడానికి తొలి మెట్టుగా ఇటీవల అధ్యయన సలహా కమిటీని ఏర్పాటు చేసింది.

ఇప్పటి పథకాల కంటే మెరుగ్గా..

రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత గల్ఫ్ వలస కార్మికుల సంక్షేమం దృష్టిలో ఉంచుకుని కొన్ని కార్యక్రమాలను అమలులోకి తీసుకువచ్చారు. గల్ఫ్ దేశాల్లో మరణించిన వారి కుటుంబాలకు రూ.5లక్షల ఎక్స్‌గ్రేషియా, వలస కార్మికుల కష్టాలు, సమస్యలను తెలుసుకోడానికి ప్రవాసీ ప్రజావాణి నిర్వహిస్తోంది. వలస కార్మికుల కుటుంబాలకు గురుకుల పాఠశాలల్లో అడ్మిషన్ల కోసం ప్రత్యేక కోటా కేటాయించాలని ప్రభుత్వం నిర్ణయించింది.

కార్మికుల్లో నైపుణ్యత..

ప్రస్తుతం ఉన్న పరిస్థితుల్లో వలస వెళుతున్న కార్మికుల్లో అనేక మందికి ఎలాంటి నైపుణ్యం లేదు. నైపుణ్యం లేని కారణంగా అనేక మంది కార్మికులు తక్కువ జీతాలకు పని చేయడం, ఉద్యోగ భద్రత లేక అవస్థలు పడుతున్నారు. కేరళలో వలస వెళ్లేవారికి వారు ఎంచుకున్న రంగంలో కనీసం ఆరు నెలల శిక్షణ కోర్సులను అక్కడి ప్రభుత్వం అందిస్తుంది. గల్ఫ్ బోర్డు ఏర్పడితే శిక్షణ శిబిరాలను నిర్వహించడానికి అవకాశం ఉంటుంది.

మోసాలను అరికట్టే విధంగా..

గల్ఫ్ వెళ్లే ప్రయత్నంలో వీసాల కోసం డబ్బులు, ఒరిజినల్ పాస్‌పోర్టులను నకిలీ ఏజెంట్ల చేతుల్లో పెట్టి చాలామంది మోసపోతున్నారు. వలసదారుల కోసం రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యల వల్ల నకిలీ ఏజెంట్ల ఆటలు కట్టించడం, గుర్తింపు ఉన్న రిక్రూటింగ్ ఏజెన్సీల ద్వారానే వలస వెళ్లేలా గల్ఫ్ బోర్డు ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేస్తే వలస మోసాలను అరికట్టే అవకాశం ఉంటుంది.

గల్ఫ్ యేతర కార్మికులకు..

తెలంగాణ నుంచి గల్ఫ్ దేశాలకు అత్యధికంగా వలస వెళ్తుండగా కొంతకాలం నుంచి మలేషియా, సింగపూర్, యూరప్ దేశాలకు వలస వెళ్లే వారి సంఖ్య క్రమ క్రమంగా పెరుగుతోంది. ఆయా దేశాల్లోను కార్మికులుగానే మెజారీ వలసదారులు పని చేస్తున్నారు. దీంతో గల్ఫ్ యేతర దేశాల వలస కార్మికులకు ప్రయోజనాలు కల్పించేలా ప్రవాసీ విధానం అమలు చేయాలనే డిమాండ్ ఉంది. గత ప్రభుత్వ హయాంలో సమగ్ర ప్రవాసీ విధానం (ఎన్ఆర్ఐ పాలసీ), గల్ఫ్ బోర్డు ఏర్పాటుకు అధ్యయనం చేసినా చిత్తశుద్ధి లేకపోవడంతో ఆ ప్రక్రియ మరుగునపడిపోయింది. ఇప్పుడు సలహా కమిటీ ఇతర రాష్ట్రాలలో అమలవుతున్న ప్రవాసీ విధానంపై అధ్యయనం చేసి మన రాష్ట్రంలో అమలు చేయాల్సిన పాలసీ ఎలా ఉండాలి అనే అంశంపై తుది నివేదికను అందించాల్సి ఉంది.

వైఎస్సార్ హయాంలో..

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు ముఖ్యమంత్రిగా వైఎస్ రాజశేఖర్‌రెడ్డి బాధ్యతలను స్వీకరించిన తర్వాత గల్ఫ్ వలస కార్మికుల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం ఎంతో కృషి చేసింది. అప్పట్లో గల్ఫ్ దేశాల్లో కాని గల్ఫ్ కారణంగా మరణించిన వారి కుటుంబాలకు రూ.లక్ష చొప్పున ఎక్స్‌గ్రేషియా ఇచ్చి ఆదుకున్నారు. కొన్ని విపత్కర పరిస్థితుల్లో ఇంటికి వచ్చిన వలస కార్మికులకు ఆయా కార్పొరేషన్‌ల ద్వారా రాయితీ రుణాలను అందించి అండగా ఉన్నారు. ఏది ఏమైనా అధ్యయన సలహా కమిటీ ఇచ్చే నివేదికపైనే గల్ఫ్ వలస కార్మికులు కొండంత ఆశతో ఉన్నారు.

కల్యాణలక్ష్మి లబ్ధిదారులను ఇబ్బంది పెట్టొద్దు

- చెక్కుల పంపిణీ కార్యక్రమాన్ని రద్దు చేయడం సరికాదు
- బాల్కొండ ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి



కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ అధికారం ఎమ్మెల్యేలకు కల్పించిన జీవోను చూపుతున్న ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి

వేల్పూర్: బాల్కొండ నియోజకవర్గంలో కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కుల పంపిణీలో జాప్యం చేస్తూ లబ్ధిదారులను ఇబ్బంది పెట్టొదని బాల్కొండ ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. చెక్కుల పంపిణీ ఇప్పటికే నెల రోజులు ఆపడమే కాకుండా, మంత్రి జూపల్లి కృష్ణారావుచే ఏర్పా టు చేయించిన పంపిణీ కార్యక్రమాన్ని కూడా రద్దు చేయడం దురదృష్టకరమన్నారు. వేల్పూర్‌లోని బాల్కొండ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సోమవారం సాయంత్రం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రభుత్వ జీవో18 ప్రకారం కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేసే అధికారం పూర్తిగా ఎమ్మెల్యేలకు మాత్రమే ఉందని, సంబంధిత జీవోను ప్రదర్శించారు. అయినప్పటికీ మంత్రితో కలిసి మంగళవారం చెక్కుల పంపిణీకి సిద్ధం కాగా, కార్యక్రమం రద్దయినట్లు అధికారులు చెప్పారన్నారు. తనకున్న అధికారంతో చెక్కులు పంపిణీ చేస్తానని కలెక్టర్, ఆర్మూర్ ఆర్డీవోకు తెలుపగా, మంత్రి చేతనే పంపిణీ చేస్తారని తెల్పడం హాస్యాస్పదమన్నారు. ఇప్పటికే ఆలస్యం అయినందున నేరుగా చెక్కులను జీపీ కార్యదర్శుల ద్వారా లబ్ధిదారులకు అందించాలని డిమాండ్ చేశారు. అలాగే కాంగ్రెస్ ఇచ్చిన హామీ మేరకు లబ్ధిదారులకు చెక్కుతోపాటు తులం బంగారం ఇవ్వాలన్నారు. బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఫ్లెక్సీ వివాదం.. ఐదు గంటల నిరసన



ఎల్లారెడ్డి సీఐ రవీందర్‌ను అడ్డుకుంటున్న అంబేడ్కర్ సంఘం నాయకులు



మాజీ ఎమ్మెల్యే సురేందర్‌తో చర్చలు జరుపుతున్న బాన్సువాడ డీఎస్పీ సత్యనారాయణ

- పలువురు దళిత నాయకులను అరెస్టు చేసిన పోలీసులు
- సీఐ క్షమాపణ చెప్పాలంటూ దళిత సంఘాల పట్టు
- డీఎస్పీ చొరవతో ఆందోళన విరమణ

లింగంపేట: మండల కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద సోమవారం ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు వివాదానికి దారితీశాయి. సుమారు ఐదు గంటల పాటు లింగంపేటలో ఉద్రిక్తత నెలకొంది. వివరాలిలా ఉన్నాయి. సోమవారం కాంగ్రెస్ నాయకులు అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. విగ్రహం వద్ద దళిత సంఘాలు ఏర్పాటు చేసిన ఫెక్సీలో మాజీ ఎమ్మెల్యే జాజాల, ఎమ్మెల్సీ కవిత ఫొటోలు ముద్రించి ఉండడాన్ని గమనించారు. అందులో ప్రస్తుత ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు ఫొటో ముద్రించకపోవడంతో కాంగ్రెస్ నాయకులు నిరసన తెలిపారు. ఆ ఫెక్సీలు తొలగించాలని పంచాయతీ కార్యదర్శి శ్రవణ్‌కుమార్‌కు ఫిర్యాదు చేశారు. ఆయన విగ్రహం వద్దకు చేరుకొని ఫెక్సీలను తొలగించాలని అంబేడ్కర్ సంఘం నాయకులకు సూచించారు. నిబంధనల ప్రకారం 50 ఫీట్ల దూరంలో ఎలాంటి ఫెక్సీలు ఉండవద్దన్నారు. ఫ్లెక్సీలను తొలగించడానికి అంగీకరించకపోవడంతో లింగంపేట ఎస్సై వెంకట్రావు ఈ విషయాన్ని ఎస్సై ఎల్లారెడ్డి సీఐ రవీందర్ నాయక్ దృష్టికి తీసుకువెళ్లారు.

సీఐ ప్రవర్తనతో పెరిగిన ఉద్రిక్తత

సీఐ రవీందర్‌నాయక్ లింగంపేటకు వచ్చి దళిత సంఘాల నేతలతో మాట్లాడారు. కాంగ్రెస్ నాయకుల ఫ్లెక్సీలు కూడా తొలగించాలని వారు పేర్కొన్నారు. ఈ క్రమంలో సీఐ సూచనతో గ్రామ పంచాయతీ సిబ్బంది కొన్ని ఫ్లెక్సీలు తొలగించి ట్రాక్టర్‌లో తరలిస్తుండగా దళిత సంఘాల నాయకులు వాగ్వాదానికి దిగారు. కాంగ్రెస్ ఫ్లెక్సీలు కూడా తొలగించాలని పట్టుబట్టారు. కాంగ్రెస్ ఫ్లెక్సీలు తొలగించనంటూనే ఏం చేసుకుంటారో చేసుకోండంటూ సీఐ అసభ్య పదజాలంతో దూషించారని దళిత సంఘాల నాయకులు ఆరోపిస్తూ ఆందోళనకు దిగారు. దీంతో రాస్తారోకో చేస్తున్న వారిని పోలీసులు అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. మండల అంబేడ్కర్ సంఘం గౌరవ అధ్యక్షుడు, మాజీ ఎంపీపీ ముదాం సాయిలును అరెస్టు చేసే క్రమంలో ఆయన చొక్కా చిరిగిపోగా ప్యాంటు ఊడిపోయింది. అర్ధనగ్నంగా ఉన్న సాయిలును పోలీసులు లాక్కెళ్లి పోలీసు వాహనంలోకి ఎక్కించారు. విషయం తెలుసుకున్న మండలంలోని దళిత సంఘాల నేతలంతా వచ్చి ధర్నాకు దిగారు. ఎల్లారెడ్డి మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్ లింగంపేటకు చేరుకొని కామారెడ్డి -ఎల్లారెడ్డి చౌరస్తాలో బైఠాయించారు. దళితులను అవమానించిన సీఐ రవీందర్ నాయక్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బాన్సువాడ డీఎస్పీ సత్యనారాయణ, కామారెడ్డి సీఐ చంద్రశేఖర్‌రెడ్డితోపాటు పలువురు ఎస్సైలు, పోలీసులు లింగంపేటకు చేరుకుని పరిస్థితి అదుపు తప్పకుండా చూశారు. డీఎస్పీ సత్యనారాయణ మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్‌తో చర్చలు జరిపారు. దళిత సంఘాల నేతల డిమాండ్ మేరకు అరెస్టు చేసిన వారిని బేషరతుగా విడుదల చేస్తామని పేర్కొన్నారు. లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేస్తే ఎల్లారెడ్డి సీఐపై ఉన్నతాధికారులకు నివేదిక పంపిస్తామని పేర్కొనడంతో దళిత సంఘాల నాయకులు శాంతించారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే సురేందర్, మాజీ ఎంపీపీ ముదాం సాయిలు, దళిత సంఘాల నాయకులు అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

అమర వీరులకు ఘన నివాళి



నగరంలోని అగ్నిమాపకశాఖ కేంద్రంలో అమర వీరులకు నివాళులు అర్పిస్తున్న అధికారులు, సిబ్బంది

ఖలీల్‌వాడి: జిల్లా కేంద్రంలోని అగ్నిమాపకశాఖ కేంద్రంలో సోమవారం అగ్నిమాపక శాఖ వారోత్సవాలు నిర్వహించారు. 1944లో బొంబాయి డాక్‌యార్డ్‌లో అగ్ని ప్రమాదం సంభవించినప్పుడు మంటలను ఆర్పుతున్న 66మంది అగ్నిమాపక సిబ్బంది మృతి చెందారు. వారి ఆత్మకు శాంతి కలగాలని సిబ్బంది రెండు నిమిషాలు మౌనం పాటించారు. ఫైర్ ఆఫీసర్ నర్సింగ్ రావు, సిబ్బంది పాల్గొన్నారు.

క్రైం కార్నర్

వివాహిత ఆత్మహత్య

బాన్సువాడ రూరల్: మండల కేంద్రంలో ఓ వివాహిత ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై అశోక్ సోమవారం తెలిపారు. వివరాలు ఇలా.. బాన్సువాడలోని సిద్ధిగల్లీలో నివాసముండే సిద్ది గంగామణి (45) కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతోంది. ఆర్థిక సమస్యలూ ఎక్కువవడంతో తీవ్ర మనస్థాపం చెందింది. ఈక్రమంలో ఆదివారం రాత్రి ఆమె ఇంట్లో నుంచి వెళ్లిపోయింది. కుటుంబ సభ్యులు ఆమెకోసం వెతుకుతుండగా సోమవారం బాన్సువాడ కల్కిచెరువులో మృతదేహం కన్పించింది. వెంటనే వారు పోలీసులకు సమాచారం అందించారు. మృతురాలి భర్త సిద్ది బాలరాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్సై అశోక్ తెలిపారు.

ఇరువర్గాలపై కేసు నమోదు

ఖలీల్‌వాడి: నగరంలోని అహ్మద్‌పుర కాలనీ రోడ్డు పక్కన దాడులు చేసుకున్న ఇరు వర్గాలపై కేసు నమోదు చేసినట్లు రెండోటౌన్ ఎస్సై యాసీన్ ఆరాఫత్ సోమవారం తెలిపారు. అజీజ్ అహ్మద్ ఖాన్ ఫిర్యాదు మేరకు అబ్దుల్ సాజిద్, అబ్దుల్ బాసిత్, మొహమ్మద్ ఆసిఫ్ అలీతోపాటు మరి కొందరిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. అలాగే అబ్దుల్ సాజిద్ ఫిర్యాదు మేరకు అజీజ్ అహ్మద్ ఖాన్, జాహెద్ అహ్మద్ ఖాన్, జాకీ అహ్మద్ ఖాన్, సమీర్ అహ్మద్ ఖాన్, మొహమ్మద్ రహీంపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

బాలికల అదృశ్యం

నవీపేట: మండలంలోని అభంగపట్నం గ్రామానికి చెందిన ఇద్దరు బాలికలు అదృశ్యమైనట్లు ఎస్సై వినయ్ సోమవారం తెలిపారు. ప్లాస్టిక్ డబ్బాలు ఏరుకునేందుకు ఈనెల 10న ఇంట్లో నుంచి బయటకు వెళ్లిన బాలికలు తిరిగి ఇంటికి రాలేదన్నారు. బంధువుల ఇళ్లలో వాకబు చేయగా ఎలాంటి ఆచూకీ లభ్యం కాలేదన్నారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రెండు ఇసుక ట్రాక్టర్లు సీజ్



ఎల్లారెడ్డి: మండలంలోని పోసానిపల్లి గ్రామం నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను పట్టుకుని సీజ్ చేసినట్లు ఎస్సై మహేష్ సోమవారం తెలిపారు. విశ్వసనీయ సమాచారం మేరకు అడివిలింగాల శివారులో పోలీసులు కాపలా కాయగా లక్ష్మాపూర్‌కు చెందిన మార్గం రాంజీ, అడివిలింగాలకు చెందిన ఆదిల్‌కు చెందిన రెండు ఇసుక ట్రాక్టర్లను పట్టుకున్నామన్నారు. అనంతరం పోలీస్‌స్టేషన్‌కు తరలించి సీజ్ చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

అంబేడ్కర్ ఆలోచనలను సమాజానికి అందించాలి



తెయూలో అంబేడ్కర్ చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న లింబాద్రి, యాదగిరిరావు, యాదగిరి



సీపీ కార్యాలయంలో..

తెయూ(డిచ్‌పల్లి): ప్రపంచ మేధావి అంబేడ్కర్ ఆలోచనలను పూర్తిస్థాయిలో సమాజానికి వర్తింపజేయాలని రాష్ట్ర ఉన్నత విద్యామండలి మాజీ చైర్మన్ లింబాద్రి అన్నారు. మహనీయుల జయంతి ఉత్సవాల్లో భాగంగా తెలంగాణ యూనివర్సిటీలో సోమవారం ఎస్సీ సెల్ డైరెక్టర్ వాణి నేతృత్వంలో 'డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆలోచనలో సామాజిక న్యాయం- విద్య, యువత సాధికారత' అనే అంశంపై సదస్సు నిర్వహించారు. కార్యక్రమానికి లింబాద్రి ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. రాజ్యాంగం అమలులోకి వచ్చిన తర్వాత భారత పౌరులు ప్రాథమిక హక్కులు, విధులు, ఆదేశిక సూత్రాలు, ఎన్నికలు, రిజర్వేషన్లను అనుభవిస్తున్నారని పేర్కొన్నారు. శాసన, కార్యనిర్వాహక, న్యాయశాఖల పని విధానాలు ఆవిష్కరించబడి అవి భారత ప్రజలను సమున్నతులుగా మార్చినట్లు తెలిపారు. ఇది కేవలం అంబేడ్కర్ రచించిన అత్యుత్తమ రాజ్యాంగం ద్వారానే సాధ్యమైందన్నారు. తెయూ వీసీ యాదగిరిరావు మాట్లాడుతూ.. రాజ్యాంగం భారతీయులందరికీ పవిత్ర గ్రంథం అని పేర్కొన్నారు. అంతకుముందు అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. రిజిస్ట్రార్ యాదగిరి, వర్సిటీ ప్రిన్సిపాల్ ప్రవీణ్, డీన్ ఘంటా చంద్రశేఖర్, అధ్యాపకులు కనకయ్య, మోహన్ బాబు, సంపత్, స్వప్న, కిరణ్ రాథోడ్ పాల్గొన్నారు.

బెటాలియన్‌లో..

డిచ్‌పల్లి: మండల పరిధిలోని ప్రత్యేక పోలీస్ ఏడో బెటాలియన్‌లో సోమవారం అంబేడ్కర్ జయంతిని ఘనంగా నిర్వహించారు. కమాండెంట్ సత్యనారాయణ ఆధ్వర్యంలో అసిస్టెంట్ కమాండెంట్ ఏడుకొండలు అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. బెటాలియన్ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సీపీ కార్యాలయంలో..

ఖలీల్‌వాడి: నగరంలోని పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో అంబేడ్కర్ చిత్రపటానికి సీపీ సాయిచైతన్య పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం సీపీ మాట్లాడుతూ.. అంబేడ్కర్ సామాన్య నిరుపేద కుటుంబంలో జన్మించినప్పటికీ తన అపార మేధాశక్తులతో సమాజంలోని రుగ్మతలను దూరం చేసేందుకు పాటుపడిన మహనీయుడన్నారు. అగ్రవర్ణాల దాడులకు గురైన బాధితులకు సత్వరన్యాయం అందించుటకు ' పోలీస్ శాఖ' నిరంతరం చిత్తశుద్ధితో కృషి చేస్తుందన్నారు. అదనపు డీసీపీ శ్రీనివాస్ రావు, ఏసీపీ రాజావెంకట్ రెడ్డి, స్పెషల్ బ్రాంచ్ సీఐ శ్రీశైలం, ఆఫీస్ సూపరింటెండెంట్ శంకర్, బషీర్, వనజ రాణి, రిజర్వు సీఐలు శేఖర్ బాబు, శ్రీనివాస్, తిరుపతి, సతీష్ పాల్గొన్నారు.



ఏడో బెటాలియన్‌లో..

దురలవాట్లకు దూరంగా ఉండాలి



పిల్లలతో కలిసి భోజనం చేస్తున్న సీపీ సాయిచైతన్య

డిచ్‌పల్లి: విద్యార్థులు దురలవాట్లకు దూరంగా ఉండాలని, బాగా చదువుకుని ఉన్నతస్థాయికి ఎదగాలని నిజామాబాద్ పోలీస్ కమిషనర్ సాయిచైతన్య సూచించారు. మండలంలోని సుద్దపల్లి ప్రభుత్వ గిరిజన ఆశ్రమ బాలుర ఉన్నత పాఠశాలను ఆదివారం రాత్రి ఆయన తనిఖీ చేశారు. పిల్లలకు భోజనం వడ్డించి వారితో కలిసి సహపంక్తి భోజనం చేశారు. అనంతరం సీపీ మాట్లాడుతూ.. మహనీయుల జీవితాలను స్ఫూర్తిగా తీసుకుని, ఉన్నత లక్ష్యాలను ఏర్పరుచుకుని పట్టుదలతో చదివి లక్ష్యాలను సాధించాలని విద్యార్థులకు సూచించారు. డిచ్‌పల్లి సీఐ మల్లేష్, ఎస్సై ఎండీ షరీఫ్, ఆశ్రమ పాఠశాల ప్రిన్సిపాల్ ధనుంజయ్, అధ్యాపకులు, సిబ్బంది ఉన్నారు.

ట్రాక్టర్ ఢీకొని ఒకరికి తీవ్ర గాయాలు

చికిత్స పొందుతూ మృతి

- పోలీసులకు లొంగిపోయిన నిందితుడు



ఒడ్డె గంగాధర్(ఫైల్)

మాక్లూర్: మండలంలోని చిక్లీ గ్రామ శివారులో రోడ్డు పక్కన ఉన్న ఓ వ్యక్తిని ట్రాక్టర్ ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు గమనించి అతడిని ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలు ఇలా.. మండలంలోని చిక్లీ గ్రామానికి చెందిన ర్యాపని ఒడ్డె గంగాధర్(48) ఆదివారం సాయంత్రం గ్రామ శివారులో రోడ్డు పక్కన తన బైక్‌ను నిలిపి, కూర్చున్నాడు. అదే గ్రామానికి చెందిన కారం నవీన్ ట్రాక్టర్ నడుపుతూ వేగంగా వచ్చి గంగాధర్‌ను ఢీకొట్టాడు. ఈ ఘటనలో అతడికి తీవ్ర గాయాలు కావడంతో స్థానికులు ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ సోమవారం అతడు మృతిచెందాడు. ఇదిలా ఉండగా ట్రాక్టర్ నడిపిన కారం నవీన్ ట్రాక్టర్‌తో పాటు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో లొంగిపోయాడు.

ఇద్దరి మధ్య భూ తగాదాలు..

నవీన్‌కు, మృతుడు గంగాధర్‌కు మధ్య కొంతకాలంగా భూ తగాదాలు నడుస్తున్నాయి. ఆదివారం సాయంత్రం గ్రామ శివారులోని కొనుగోలు కేంద్రం వద్ద ఇద్దరి మధ్య ఘర్షణ జరిగింది. ఈక్రమంలో నవీన్ ట్రాక్టర్‌తో కావాలనే అతడిని ఢీకొట్టాడని మృతుడి బంధువులు ఆరోపిస్తున్నారు. దీంతో పోలీసులు ముందస్తు చర్యగా చిక్లీలో పోలీస్ పికెటింగ్ ఏర్పాటుచేసి, ఘటన స్థలాన్ని పరిశీలించారు. మృతుడి కుమారుడు శ్రీకాంత్ ఫిర్యాదు మేరకు నవీన్‌పై హత్యకేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రాజశేఖర్ తెలిపారు.

మొక్కజొన్న పంట దగ్ధం



కాలిపోయిన మొక్కజొన్నను చూపుతున్న రైతులు

పెద్దకొడప్‌గల్(జుక్కల్): మండలంలోని వడ్లం గ్రామ శివారులో ఓ రైతు సుమారు రెండు ఎకరాల్లో వేసిన మొక్కజొన్న పంట ప్రమాదవశాత్తు దగ్ధమైంది. బాధితుడు తెలిపిన వివరాలు ఇలా.. మండలంలోని వడ్లం గ్రామానికి చెందిన మల్లయ్యల హన్మండ్లు తనకున్న 2.20 ఎకరాలల్లో మొక్కజొన్న పంటను సాగుచేశాడు. సోమవారం పొలం దగ్గరకు వెళ్లి చూడగా చేతికొచ్చిన పంటంతా కాలిపోయింది. పంటను అమ్మి అప్పులు తీర్చుకుందామంటే అగ్ని ప్రమాదంతో కష్టమంతా బూడిదపాలయిందని రైతు ఆవేదన వ్యక్తం చేశాడు. సుమారు రూ.లక్ష 50వేల నష్టం అయిందని, ప్రభుత్వం స్పందించి ఆదుకోవాలని కోరుతున్నాడు.

రేపల్లెవాడలో గుడిసె..



ఎల్లారెడ్డిరూరల్: మండలంలోని రేపల్లెవాడలో గ్యాస్ సిలెండర్ పేలి గుడిసె దగ్ధమైనట్లు గ్రామస్తులు సోమవారం తెలిపారు. గ్రామంలోని కుమ్మరి తిరుపతికి చెందిన గుడిసెలో అకస్మాత్తుగా గ్యాస్ సిలెండర్ పేలడంతో మంటలు అంటుకున్నాయి. ప్రమాదంలో ఇంట్లోని దుస్తులు, వంటసామగ్రి, అరతులం బంగారం, 20 తులాల వెండి కాలిబూడిదైనట్లు బాధితుడు తెలిపారు. ప్రభుత్వం తమ కుటుంబాన్ని ఆదుకోవాలని కోరుతున్నాడు.

ఆత్మహత్యకు యత్నించిన వ్యక్తిని కాపాడిన పోలీసులు



వర్ని: మండలంలోని అఫ్పంది ఫారంలో ఓ వ్యక్తి ఆత్మహత్యకు యత్నించగా పోలీసులు కాపాడారు. వివరాలు ఇలా.. గ్రామంలోని గుగులోతు శివాజీ (30) సోమవారం తన ఇంటి తలుపులు పెట్టుకుని ఉరివేసుకొని ఆత్మహత్యకు యత్నించాడు. కుటుంబసభ్యులు గమనించి, డయల్100కు సమాచారం అందించారు. వెంటనే స్పందించిన బ్లూ కోర్టు సిబ్బంది ఘటన స్థలానికి వెళ్లి ఇంటి తలుపులను బద్దలు కొట్టి శివాజీని కాపాడారు. శివాజీ ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్యకు యత్నించినట్లు ఎస్సై మహేష్ వెల్లడించారు.

అల్ప్రాజోలం పట్టివేత!

నిజామాబాద్ రూరల్: రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఖానాపూర్ చౌరస్తా వద్ద సోమవారం విశ్వసనీయ సమాచారం మేరకు పెద్ద ఎత్తున అల్ప్రాజోలంను ట్రైనీ ఐపీఎస్ సాయికిరణ్ పట్టుకున్నట్లు తెలిసింది. ఈ విషయంపై రూరల్ పోలీసులను 'సాక్షి' వివరణ కోరగా పూర్తి వివరాలు సేకరిస్తున్నట్లు తెలిపారు.

ఆరోటౌన్ పోలీస్‌స్టేషన్ తనిఖీ

ఖలీల్‌వాడి: జిల్లా కేంద్రంలోని ఆరో టౌన్ పోలీస్ స్టేషన్‌ను సీపీ సాయి చైతన్య సోమవారం తనిఖీ చేశారు. అనంతరం సిబ్బందికి పలు అంశాలపై సలహాలు, సూచనలు చేశారు. సిబ్బంది సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సౌత్ రూరల్ సీఐ సురేష్ కుమార్, ఎస్సై వెంకట్ రావు, సిబ్బంది పాల్గొన్నారు.